విద్యుద్దీపాల వెలుగులో దేవాలయాలు

• మహాశివరాత్రికి ఆలయాలు ముస్తాబు • ఉపావాస దీక్షలు.. శివయ్యకు పూజలు



సుభాష్‌నగర్: మహాశివరాత్రి పండుగను పురస్కరించుకొని కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు శివాలయాలు ముస్తాబయ్యాయి. రెండు రోజుల ముందే శివాలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. సూరారం ఉమామహేశ్వర ఆలయానికి వెళ్లే ప్రధాన రోడ్డుపై స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. నల్లగుట్ట, సుభాష్‌నగర్, అంగడిపేటలోని శివాలయాలు కూడా శుక్రవారం జరగనున్న మహాశివరాత్రికి భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

◆ సూరారంలోని ఉమామహేశ్వర ఆలయంలో గురువారం స్వామివారి కల్యాణం వైభవంగా జరిగింది. డాక్టర్ శివదత్తగౌడ్, సుమనిత దంపతులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త మదన్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన హోమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



సుచిత్ర వద్ద బస్సుల కోసం వేచి ఉన్న జనం

పండగ సెలవులు.. ఊళ్లకు పరుగులు

మహా శివరాత్రి పండుగను పురస్కరించుకొని వరుసగా మూడు రోజులు సెలవులు వచ్చాయి. దీంతో ప్రజలు తన సొంతూళ్లకు పయనమయ్యారు. గురువారం 44వ జాతీయ రహదారి సుచిత్ర బస్టాప్ ప్రయాణికులతో కిటకిటలాడింది. అదిలాబాద్ నిజామాబాద్ మెదక్ వైపు వెళ్లే బస్సుల్లో జేబీఎస్ నుంచే నిండిపోవడంతో ప్రయాణికులు గత్యంతరం లేక ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించారు. – సుభాష్‌నగర్

రంజాన్ మాసంలో భక్తులకు అన్ని ఏర్పాట్లు చేస్తాం

కుత్బుల్లాపూర్: ముస్లింలకు పవిత్రమైన రంజాన్ మాసంలో ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. గురువారం పేట్ బషీరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన అన్ని విభాగాల అధికారులు, మసీదు కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రంజాన్ మాసంలో మసీదుల వద్ద వీధిదీపాలు, తాగునీటి సరఫరా, రోడ్ల మరమ్మతులు, పారిశుద్ధ్యం వంటి పనులు సక్రమంగా జరిగేలా చూస్తామన్నారు. గాజులరామారం లాల్ సాహెబ్‌గూడకు చెందిన ఎస్వీఆర్ సొసైటీ, శ్రీరామ్ నగర్–ఏకు చెందిన నూతన వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిసి కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిటీలకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే స్థానికంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి కాలనీలవాసులకు అండగా ఉంటామన్నారు. మాజీ వార్డ్ మెంబర్ సింగారం మల్లేష్, సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఉన్నారు.



పార్టీలు, ప్రాంతాలకు అతీతంగా అభివృద్ధి



ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజును సత్కరిస్తున్న సంక్షేమ సంఘం నాయకులు

కుత్బుల్లాపూర్: పార్టీలు, ప్రాంతాలకు అతీతంగా అభివృద్ధి చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు శంభీపూర్ రాజు అన్నారు. గురువారం శంభీపూర్‌లోని కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఎమ్మెల్సీని మర్యాదపూర్వకంగా కలిశారు. తమ ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సదుపాయాలను కల్పించాలని కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు.

మహిళలు ఆరోగ్యంపై దృష్టి సారించాలి



మహిళల వైద్య పరీక్షల ప్యాకేజీని ఆవిష్కరిస్తున్న ఎస్ఎల్‌జీ ఆస్పత్రి ఎండీ సోమరాజు, సిబ్బంది

నిజాంపేట్: మహిళలు తమ ఆరోగ్య సంరక్షణపై దృష్టి సారించాలని ఎస్ఎల్‌జీ ఆస్పత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డీవీఎస్ సోమరాజు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలకు ప్రత్యేక వైద్య పరీక్షల ప్యాకేజీని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సోమరాజు మాట్లాడుతూ... కేవలం రూ.999కే ఉదర భాగానికి, గర్భాశయానికి అల్ట్రాసౌండ్ స్కానింగ్, రెండు రొమ్ములకు అల్ట్రాసౌండ్ స్కానింగ్, గర్భాశయ ముఖద్వార కేన్సర్‌ను గుర్తించే పాప్ స్మియర్ టెస్ట్, కంప్లీట్ బ్లడ్ పిక్చర్ పరీక్షలతో పాటు, గైనకాలజిస్టు కన్సల్టేషన్, జనరల్ సర్జన్ కన్సల్టేషన్ కూడా ఈ ప్యాకేజీలో భాగంగా అందించనున్నారు. ఈ నెల 7వ తేదీ నుండి ఏప్రిల్ 7వ తేదీ వరకు ఈ ప్యాకేజీ ఉంటుందని, ఇందుకోసం రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు 040–23785678 నంబరుకు తమ వివరాలు నమోదు చేసుకోవాలన్నారు.

పరీక్ష కేంద్రానికి తీసుకెళ్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రామకృష్ణ

నిజాంపేట్: బైక్ అదుపు తప్పి తండ్రి, కుమార్తె గాయపడిన ఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండాపూర్‌కు చెందిన రామకృష్ణ గురువారం ఇంటర్ పరీక్షలు రాయించేందుకు తన కుమార్తెకు బాచుపల్లిలోని ఎస్ఆర్ఐ కళాశాలకు బైక్‌పై తీసుకు వస్తున్నాడు. కౌసల్య కాలనీ నుంచి కళాశాలకు వచ్చే మార్గంలో రోడ్డు సరిగా లేకపోవడంతో బైక్ జారిపడి తండ్రి కుమార్తెలు కింద పడ్డారు. ఈ ఘటనలో రామకృష్ణ కంటి భాగం, అరచేతికి తీవ్రగాయం కావడంతో అపస్మారకస్థితికి చేరుకున్నాడు. అతని కుమార్తె స్వల్ప గాయాలతో బయటపడింది. స్థానికులు ఆమెను పరీక్ష కేంద్రానికి తీసుకెళ్లారు. తీవ్రంగా గాయపడిన రామకృష్ణను స్థానికంగా ఉన్న ఎస్ఎల్‌జీ ఆస్పత్రిలో చేర్పించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

59 క్వింటాళ్ల బియ్యం పట్టివేత

జగద్గిరిగుట్ట: పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు సీజ్ చేసి 59 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం ఉదయం 5గంటల సమయంలో జగద్గిరిగుట్ట పోలీసులు ఆల్విన్ కాలనీలోని జలకన్య హోటల్ సమీపంలో తనిఖీలు చేపట్టారు. ఈ నేపథ్యంలో (టీఎస్ 30టీఏ 7532) టాటా వాహనాన్ని ఆపి సోదాలు చేశారు. అందులో తరలిస్తున్న 59 కింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుబడింది. యాదాద్రి భువనగిరి జిల్లా గోవింద్ తాండాకు చెందిన మెడవాత్ నవీన్(22)ను అదుపులోకి ప్రశ్నించగా గత కొంత కాలంగా స్థానికంగా పీడీఎస్ బియ్యాన్ని స్థానికుల నుంచి కొనుగోలు చేసి ఇతర ప్రాంతాల్లో ఎక్కువ డబ్బులకు విక్రయిస్తున్నట్లు అంగీకరించాడు. నిందితుడిపై కేసు నమోదు చేసిన పోలీసులు రిమాండ్‌కు పంపారు.

స్త్రీలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు

కుత్బుల్లాపూర్: నేడు పురుషులకు సమానంగా స్త్రీలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, సృష్టించే శక్తి ఒక స్త్రీకి మాత్రమే ఉందని సుభాష్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ హేమలత సురేష్‌రెడ్డి అన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కార్పొరేటర్‌ను స్థానిక మహిళా సంఘం ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. లింగ వివక్షతను రూపు మాపడానికి ప్రతి సంవత్సరం మహిలా దినోత్సవాన్ని జరుపుకుంటు వస్తున్నామని, నేడు విద్యా, వైద్య, ప్రభుత్వ ఉద్యోగాలు, రాజకీయాల్లో ఇలా అనేక రంగాల్లో స్త్రీలు తమ సత్తా చాటుతున్నారని పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల సహకారం ఉంటే ఎంతటి కష్టతరమైనదానినైనా సాధించే సత్తా మహిళలకు ఉందన్నారు.

బెదరరు.. అదరరు!

ప్రభుత్వ స్థలంలో బోర్డు ఏర్పాటు చేసిన గంటల్లోనే తొలగిస్తున్న కబ్జారాయుళ్లు

వాళ్లు పాతారు..



బుధవారం ప్రభుత్వ స్థలంగా పేర్కొంటూ బోర్డు ఏర్పాటు చేస్తున్న అధికారులు

వీళ్లు తొలగించారు..



బోర్డు ఏర్పాటు చేసి గంటలు గడవక ముందే కబ్జాదారులు తొలగించిన దృశ్యం

- అధికారులకు చుక్కలు చూపిస్తున్న అక్రమార్కులు
- నదరు స్థలాన్ని కబ్జా చేసి తీరుతామంటున్న వైనం
- సర్వే నం.13లోని స్థలం విషయంలో నిత్యం ఇదే తంతూ..

సుభాష్‌నగర్: గాజులరామారం సర్వే నం.13లోని ప్రభుత్వ స్థలాన్ని ఎలాగైనా కబ్జా చేసి తీరుతామని కబ్జారాయుళ్లు సవాల్ విసురుతున్నారు. పది రోజుల నుంచి ప్రభుత్వ స్థలంలో గదిని నిర్మించడం.. రెవెన్యూ అధికారులు కూలడం.. తిరిగి కబ్జారాయిలు సదరు స్థలాన్ని తమ ఆధీనంలోకి తీసుకోవడం పరపాటిగా మారింది. ఈ విషయమై పది రోజులుగా 'సాక్షి'పలు కథనాలు ఇవ్వడంతో తహసీల్దార్ రెహమాన్ ఆదేశాల మేరకు బుధవారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రజనీకాంత్ తన సిబ్బందితో సదరు స్థలంలో ప్రభుత్వ స్థలంగా పేర్కొంటూ బోర్డు ఏర్పాటు చేశారు. బోర్డు ఏర్పాటు చేసి నాలుగు గంటలు కాకముందే కబ్జాదారులు బోర్డును తొలగించి పక్కనే ఉన్న చెరువులో పారేశారు.

అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు తొలగింపు..

సర్వే నం.13లో రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డును బుధవారం రాత్రి కొంతమంది తొలగించడంతో గమనించిన స్థానికులు వారితో వాగ్వాదానికి దిగారు. దీంతో ఇరువురి మధ్య మాట మాట పెరిగి పోట్లాటకు దారితీసింది.

పలువురి పై రిపోర్ట్...

విషయం తెలుసుకున్న రెవెన్యూ ఇన్స్పెక్టర్ రజనీకాంత్ గురువారం అక్కడికి చేరుకున్నారు. ఈ తంగానికి ఎవరు పాల్పడ్డారో విచారణ చేపట్టారు. స్థానికుల సాక్ష్యం మేరకు శ్రీనాథ్, సంధ్య, శోభారాణి, కుమారిలపై కేసు నమోదు చేయాలంటూ తహసీల్దార్‌కు రిపోర్ట్ చేశారు. బోర్డును ఎవరు తీశారు.రు ఇక్కడ మట్టి పోస్తుంది ఎవరు? కబ్జా వెనకాల ఎవరెవరి హస్తం ఉంది? అనే కోణంలో స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. తనిఖీ అనంతరం మరి కొందరిపై కేసు నమోదు చేసే అవకాశం ఉంది.

తెరపైకి ఓ విద్యార్థి సంఘం నేత..

సర్వే నం.13లో ఉన్న ఎక్కడ స్థలాన్ని కబ్జా చేసేందుకు పలు పార్టీల నాయకులు చేతులు కలిపిన విషయం తెలిసిందే. బుధవారం రాత్రి బోర్డు తీసేసిన విషయమై గొడవలో ఓ విద్యార్థి సంఘం నేత తెరపైకి రావడం గమనార్హం.

ప్రభుత్వ స్థలమంటూ అధికారులు బోర్డు పాతుతారు. గంటల్లోనే కబ్జారాయుళ్ల ఆ బోర్డును తొలగిస్తారు. గాజులరామారం సర్వే నం.13లోని ప్రభుత్వ స్థలం విషయంలో నిత్యం ఇదే జరుగుతోంది. ఈ స్థలం విషయంలో కబ్జారాయుళ్లు చట్టాలకు భయపడం.. కేసులకు బెదరం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రజాప్రతినిధుల అండనో.. లేక అధికారులు ఏమీ చేయలేరనే ధీమానో.? తెలియదు కానీ కబ్జారాయుళ్ల రెవెన్యూ అధికారులకు చుక్కలు చూపిస్తున్నారు. మరి వీరిపై ఉన్నతాధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో మిలియన్ డాలర్ల క్వశ్చన్. ఇప్పటికైనా అక్రమార్కులపై కఠినమైన చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాలి.

ఎవరినీ వదిలిపెట్టేది లేదు..

సర్వే నం.13లో కబ్జాకు పాల్పడుతున్న వారిని వదిలే ప్రసక్తి లేదు. ఇప్పటికే కబ్జాకు పాల్పడుతున్న వారిని గుర్తించేందుకు విచారణ చేపట్టాలని సిబ్బందిని ఆదేశించాను. ఇప్పటికే నలుగురిపై ఫిర్యాదులు అందాయి. మిగతా వారిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేస్తాం.

– రెహమాన్, తహసీల్దార్

మళ్లీ నిర్మాణం చేపడితే చర్యలు తప్పవు

సాక్షి ఎఫెక్ట్..



నిర్మాణంలో ఉన్న గదిని కూల్చివేసిన అధికారులు

జగద్గిరిగుట్ట: 'ఒప్పందం కుదిరినట్టుంది!'అనే శీర్షికతో గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి రెవెన్యు అధికారులు స్పందించారు. రాజీవ్ గృహకల్ప చర్చ్ సమీపంలో చేపడుతున్న అక్రమ నిర్మాణాన్ని కూల్చివేశారు. తిరిగి నిర్మాణానికి ప్రయత్నిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

విద్యార్థినులకు మెమొంటోలు

దుండిగల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను గురువారం దుండిగల్‌లోని ఎంఎల్ఆర్ఐటీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యా సంస్థల చైర్మన్, కళాశాల కోశాధికారి మమతరెడ్డిలు ఉత్తమ ప్రతిభపాటవాలు కనబరుస్తున్న విద్యార్థినులు, అధ్యాపకులను మెమొంటోలు, సర్టిఫికెట్లు అందజేసి సత్కరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు, డైరెక్టర్ శ్రేయరెడ్డి, డీన్ రాధికాదేవి పాల్గొన్నారు.

అటవీప్రాంతంలో అగ్నిప్రమాదాలు జరగకుండా చూడాలి



జీడిమెట్ల: వేసవిలో అటవీప్రాంతంలో అగ్నిప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కూకట్‌పల్లి డిస్ట్రిక్ ఫైర్ ఆఫీసర్ పి.గిరిధర్‌రెడ్డి అన్నారు. గురువారం దూలపల్లిలోని రాష్ట్ర ఫారెస్ట్ అకాడమీలో అగ్నిప్రమాదాల నియంత్రణపై ట్రైనింగ్‌లో ఉన్న అటవీ అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కూకట్‌పల్లి డీఎఫ్‌వో గిరిధర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. వేసవికాలంలో అటవీప్రాంతంలో ఎండిన ఆకులు ఎక్కువగా ఉండటంతో అగ్నిప్రమాదాలు చోటు చేసుకుంటాయని అన్నారు. దీని కోసం సిబ్బంది ముందు జాగ్రత్తగా చర్యలు తీసుకోవాలని కోరారు. అకాడమీలో ట్యాంకుల్లో నీటిని నిల్వ ఉంచుకోవాలని తెలిపారు. దీనితో పాటు అగ్నిప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక సిబ్బందికి ఫోన్‌ద్వారా సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫైర్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ లక్ష్మీప్రసాద్, జీడిమెట్ల ఎస్ఎఫ్‌వో సుభాష్‌రెడ్డితో పాటు ఫైర్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా విజేత సూపర్ మార్కెట్ సిల్వర్ జూబ్లీ వేడుకలు



విజేత సూపర్‌మార్కెట్ వార్షికోత్సవం వేడుకల్లో పాల్గొన్న మురకొండ జగన్‌మోహన్ రావు, శ్రీమతి కృష్ణవేణి, సందీప్ చౌదరి, సిద్ధార్థ, ఉద్యోగులు



కూకట్‌పల్లి: విజేత సూపర్‌మార్కెట్ 25వ వార్షికోత్సవం పురస్కరించుకొని గురువారం ప్రధాన కార్యాలయం చందానగర్, అమీన్‌పూర్‌లలో కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. 25 సంవత్సరాలుగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో వినియోగదారులకు నాణ్యమైన నిత్యావసర సరుకులు, తాజా కూరగాయలు, పండ్లు, వివిధ రకాల వస్తువులు, గృహోపకరణాలు అందిస్తున్నామని మేనేజింగ్ డైరెక్టర్ మురకొండ జగన్‌మోహన్ రావు తెలిపారు.

◆ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 1999 మార్చి 7న మొదటి బ్రాంచ్‌ను ప్రారంభించి నేడు 109 బ్రాంచిలతో విజేత సూపర్ మార్కెట్ బ్రాండ్ ఐకాన్‌గా నిలిచిందన్నారు. మమ్మల్ని నమ్మిన వినయోగదారులకు మాకు అండగా నిలిచిన డిస్ట్రిబ్యూటర్‌లకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ 25 సంవత్సరాల ప్రయాణంలో తమకు సహాయ, సహకారాలు అందించిన కుటుంబ సభ్యులు, విజేత కుటుంబంలో భాగమైన ఉద్యోగులు ఈ విజయంలో కీలకపాత్ర వహించినందుకు గర్వపడుతున్నానని అన్నారు. ఎంతోమందికి ఉపాధి కల్పించినందుకు సంతోషంగా ఉందని తెలిపారు.

◆ ఈ వార్షికోత్సవం సందర్భంగా జూబ్లీ జాక్‌పాట్ లక్కీ డ్రా ద్వారా మొదటి బహుమతి టాటా నెక్సాన్ కారు, ద్వితీయ బహుమతులు 5 రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌లు, తృతీయ బహుమతులు 25 చేతక్ ఈవి స్కూటర్లు, బోనస్ బహుమతులు 111 మంది లక్కీ విజేతలకు పానాసోనిక్ కుక్కర్లను అందజేయనున్నట్లు తెలిపారు.

◆ ఫిబ్రవరి 23 నుంచి మార్చి 31వ తేదీ వరకు విజేత సూపర్‌మార్కెట్‌లో రూ.500 కొనుగోలు చేసి కూపన్ పొందిన వారు లక్కీడ్రాకు అర్హులకు వార్షికోత్సవం, మహిళా దినోత్సవం సందర్భంగా ఉద్యోగులందరికి బహుమతులు అందజేశారు.

◆ ఈ కార్యక్రమంలో విజేత సూపర్‌మార్కెట్ మేనేజింగ్ డైరెక్టర్ మురకొండ జగన్ మోహన్ రావు, శ్రీమతి కృష్ణవేణి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మురకొండ సందీప్ చౌదరి, మార్కెటింగ్ డైరెక్టర్ సిద్ధార్థ, డిస్ట్రిబ్యూటర్లు, ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సీలింగ్ భూముల మార్పిడిలో రూ.వేల కోట్ల స్కామ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నేత మాల్లారెడ్డి

దుండిగల్: దుండిగల్ మున్సిపల్ పరిధిలో ప్రభుత్వ సీలింగ్ భూమి అక్రమ మార్పిడిలో వెయ్యి కోట్ల రూపాయల స్కామ్ జరిగిందని బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి అన్నారు. గురువారం దుండిగల్ గ్రామంలో పర్యటించిన బీజేపీ నాయకులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దుండిగల్ సర్వే నంబర్లు. 284, 285, 321, 32, 323, 324, 325, 330 నుంచి 335, 345, 358 నుంచి 362 వరకు, 423 నుంచి 426 వరకు మొత్తం 106.07 ఎకరాల ప్రభుత్వ భూమి సీలింగ్ భూమిని ప్రైవేటు భూములుగా మార్పిడి చేశారని అన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా చేసిన నోటి ఫైను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దుండిగల్ మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు మల్లేష్ యాదవ్, నాయకులు ఆకుల విజయ్‌సాయి, ఆకుల మల్లేష్, దొడ్లకృష్ణ, భానుప్రసాద్, తల్లారి రాజు తదితరులు ఉన్నారు.

రుద్ర కన్‌స్ట్రక్షన్ పేరుతో అక్రమ నిర్మాణాలు

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ ప్రగతినగర్‌లోని రుద్ర కన్‌స్ట్రక్షన్ పేరుతో అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నా అధికారులు చూసీచూడనటు వ్యవహరిస్తున్నారని కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ ఆరోపించారు. గురువారం బీజేపీ ఆధ్వర్యంలో నిజాంపేట్ గ్రామ సర్వే నంబర్లు 146, 155, 156, 162, 163, 164, 165, 142 లలో రుద్ర కన్‌స్ట్రక్షన్స్ పేరిట నిర్మిస్తున్న అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కన్‌స్ట్రక్షన్ యజమాని పల్లెపటి నవీన్‌కు ఎమ్మెల్సీ కవితతో సన్నిహిత సంబంధాలున్నాయని ఆరోపించారు. దీంతో నాలుగు అంతస్తులకు పర్మిషన్లు తీసుకుని 17 బ్లాక్‌లుగా ఐదంతస్తులు చొప్పున నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు చర్యలు తీసుకోవడంలో వెనుకడుగు వేస్తున్నారని అన్నారు. సదరు నిర్మాణాలను సక్రమంగా చేసుకునేందుకు దొడ్డిదారిన యత్నిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ఈ వ్యవహారంపై దర్యాప్తు జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మేయర్‌కు ఆహ్వానం

నిజాంపేట్: ఆదర్శనగర్ ఉమెన్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ భారతి ఆధ్వర్యంలో అసోసియేషన్ సభ్యులు నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డిని గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. శుక్రవారం జరిగే మహిళా దినోత్సవానికి రావాలని మేయర్‌ను ఆమె ఆహ్వానించారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పెండింగ్ బీఆర్ఎస్ ఘనతే..



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు బొంగునూరి కిషోర్‌రెడ్డి

దుండిగల్: బీఆర్ఎస్ పార్టీ నాయకుల మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బొంగునూరి కిషోర్‌రెడ్డి విమర్శించారు. గురువారం డిపోచంపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 20 లక్షలకు పైగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందన్నారు. వాటిని పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తుంటే బీఆర్ఎస్ పార్టీ నాయకులు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.

◆ ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, ఎమ్మెల్యే వివేకానందలు గతంలో కేసీఆర్ ఇచ్చిన హామీలపై ఎందుకు నోరు మెదపరని ప్రశ్నించారు. దళిత సీఎం, కేజీ టు పీజీ వరకు ఉచిత విద్య, దళితులకు 3 ఎకరాల భూమి ఇవ్వకుండా పదేళ్ల పాటు రాష్ట్ర ప్రజలను బీఆర్ఎస్ మోసం చేసిందన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ప్రతిపక్షంలో కూర్చోబెట్టినా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు బుద్ధి రావడం లేదన్నారు. ప్రజాధనాన్ని నొక్కి ఫార్ములా ఈ రేసు పేరుతో జల్సా చేసింది కేటీఆర్ కాదా అని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన 90 రోజుల కాంగ్రెస్ ప్రభుత్వంలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే ఓర్వలేక ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని అన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అడ్రస్ కోల్పోవడం ఖాయమని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు సాదుయాదవ్, ప్రేమకుమార్, అక్బర్, కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.